# రైతులు భూముల వివరాలు ఇవ్వండి



మాట్లాడుతున్న చామ కృష్ణారెడ్డి

**హయత్‌నగర్:** భూములు లేని రైతుల సభ్యత్వం తొలగించేందుకు వీలుగా భూములు ఉన్న రైతులు తమ వివరాలు రైతు సేవా సహకార సంఘానికి ఇవ్వాలని హయత్‌నగర్ రైతు సేవా సహకార సంఘం అధ్యక్షుడు చామ కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందాలంటే తప్పని సరిగా భూముల వివరాలు అవసరం ఉంటుందన్నారు. వివరాలు ఇవ్వని వారి సభ్యత్వం రద్దవుతుందన్నారు. చనిపోయిన రైతుల సభ్యత్వం తొలగించాలని, భూమి లేని రైతులను గుర్తించి సభ్యత్వం రద్దు చేయాలని పలువు రైతులు కోరారు. ఈ సందర్భంగా సీఈఓ మల్లికార్జున్ సంఘం జమా ఖర్చులను వివరించగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఢిల్లీ విజయలక్ష్మి, డైరెక్టర్లు ముత్యాల రాజశేఖర్, నర్సింహారెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, దోమలపల్లి అంజయ్య,కిన్నెర నర్సమ్మ రైతులు క్షేత్రం శంకర్‌రెడ్డి, జోర్క శ్రీరాములు, ఎల్మటి బుచ్చిరెడ్డి, సురకంటి శ్రీనివాస్‌రెడ్డి, కవాడి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

# మెరుగైన సేవలతోనే గుర్తింపు



నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న డీసీపీ ప్రవీణ్‌కుమార్

**మన్సూరాబాద్:** ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తే తగిన గుర్తింపు ఉంటుందని ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఫెడరల్ బ్యాంక్ నూతన బ్రాంచ్ కార్యాలయాన్ని నాగోలు డివిజన్ పరిధి రాక్‌టౌన్‌కాలనీలో శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు ఫెడరల్ బ్యాంక్ జోనల్ హెడ్ బి.దిలీప్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఖాతాదారులకు ఇబ్బందులు తలెత్తకుండా మెరుగైన సేవలు అందించి వారి మన్ననలు పొందాలన్నారు. ఫెడరల్ బ్యాంక్ నూతన బ్రాంచ్ ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శాలీని వారియర్, చార్లీ దేవస్య, గోవిరెడ్డి సునిత పాల్గొన్నారు.

## ఓపెన్ జిమ్ ప్రారంభం

**లింగోజిగూడ:** ప్రజా సమస్యలు పరిష్కరించండంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక కాలనీల్లో వేగంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్ అన్నారు. లింగోజిగూడ డివిజన్ పరిధిలోని జనప్రియ అపార్ట్‌మెంట్స్ సముదాయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను గురువారం రాత్రి ఆయన స్థానిక కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనప్రియ కాలనీ ప్రధాన రహదారికి కనెక్టివిటీ సమస్యను తీరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కందికంటి శ్రీధర్‌గౌడ్, పల్సాం శ్రీధర్‌గౌడ్, జూపల్లి ప్రవీణ్, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.



ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న మధుయాష్కిగౌడ్

## భక్తులకు ఇబ్బందులు రానివ్వొద్దు



పనులను పరిశీలిస్తున్న రంగానర్సింహగుప్తా

**చైతన్యపురి:** మూసీ నదిలో స్వయంభూ గా వెలిసిన శివలింగం శివాలయంలో శివరాత్రి సందర్భంగా జరిగే జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా అన్నారు. జాతర సందర్భంగా జరిగే పనులను ఆయన జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రత్నసాయితో కలిసి పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ మేనేజర్ రుక్కయ్య, జవాన్ నరేష్, ఎస్ఎఫ్ఏ గణేష్, టెంపుల్ చైర్మన్ కృష్ణారెడ్డి, అంజిబాబు, వెంకన్న, రుదారపు శంకర్, వెంకటరమణ పాల్గొన్నారు.

# కాలనీల్లో కరువైన కనీస వసతులు

**దిల్‌సుఖ్‌నగర్:** ఆర్‌కేపురం, సరూర్‌నగర్ డివిజన్ పరిధిల్లని వివిధ కాలనీల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. మధ్యతరగతి, బడుగు బలహీన వర్గాల ప్రజలు నివసించే ఈ కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. ఎన్‌టీఆర్‌నగర్, అంబేడ్కర్‌కాలనీ, భగత్‌సింగ్‌నగర్, సిరినగర్ తదితర కాలనీలను పట్టించుకునే నాథులే లేరని స్థానికులు వాపోతున్నారు. ఆయా ప్రాంతాల్లో ఎటు చూసినా అపరిశుభ్రతతో అంతర్గత రహదారులు దర్శనమిస్తున్నాయి. అంతర్గత డ్రైనేజీ వ్యవస్థ మరీ అధ్వానంగా ఉండి మురుగు ఏరులై పారుతుంటుంది. ఉన్నతాధికారులు స్పందించి ఆయా ప్రాంతాల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



డ్రైనేజీ నుంచి పొంగుతున్న మురుగు

# సనాతన ధర్మాన్ని అవలంబించాలి



పూజలు నిర్వహిస్తున్న త్రిదండి రామానుజ జీయర్

**దిల్‌సుఖ్‌నగర్:** ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీలోని శ్రీఅష్టలక్ష్మీ అమ్మవారి ఆలయంలో శుక్రవారం శ్రీఆదిలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణస్వామివారికి భాష్యాకార సిద్ధాంత పీఠాధిపతులు పరమహంస పరివ్రాజకాచార్య అనంత శ్రీవిభూషిత శ్రీత్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామజీ మాట్లాడుతూ.. శ్రీఅష్టలక్ష్మీ శ్రీమన్నారాయణ స్వామివారికి ప్రత్యేక పూజలు చేయడంతో ఎంతో పుణ్యం లభిస్తుందన్నారు.భక్తి ప్రపత్తులతో స్వామివారిని కొలుస్తు ప్రతి ఒక్కరు సనాతన ధర్మాన్ని అవలంబించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సురేష్‌కుమార్, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్, సుధాకర్‌గుప్తా, శ్రవణ్ కుమార్, జగన్, అంజయ్య పాల్గొన్నారు.

## మంత్రికి వినతి

**ఎల్బినగర్::** ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ముద్దగోని రామ్మోహన్‌గౌడ్ శుక్రవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశారు. గత నెల 28న హయత్‌నగర్‌లో జరిగిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో పాల్గొన్న రాంరెడ్డి, రామ్మోహన్‌గౌడ్ వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఇచ్చిన హామీ మేరకు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మంత్రిని కలిసిన వారిలో జైపాల్‌రెడ్డి, కోటయ్య, బుచ్చిరెడ్డి, రామచంద్రగౌడ్, బిటన్ రెడ్డి పాల్గొన్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

## షార్ట్ సర్క్యూట్‌తో పేలిన సిలిండర్



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్

**ఎల్బీనగర్:** షార్ట్ సర్క్యూట్‌తో గ్యాస్ సిలిండర్ పేలిన ఘటన బీఎన్‌రెడ్డినగర్ చోటు చేసుకుంది. డివిజన్ పరిధిలోని వైదేహినగర్ శ్రీషిరిడీ సాయిబాబ దేవాలయం వద్ద శుక్రవారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు ఏర్పడి అవి గ్యాస్‌కు అంటుకోవడంతో ఒక్కసారిగా పేలింది. స్థానికుల సమాచారం మేరకు ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేశారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మాట్లాడారు. పేలుడు ధాటికి ఇల్లు ధ్వంసమైందని యజమానిని ఆదుకోవాలని అధికారులను కోరారు.





- వనస్థలిపురం రైతుబజారు వద్ద మళ్లీ తోపుడు బండ్లు, వ్యాపార సముదాయాలు
- రోడ్డు ఆక్రమణలతో కుంచించుకుపోతున్న దారి
- రాకపోకలకు ఇబ్బందులు

# రోడ్డుపై వ్యాపారాలు.. ట్రాఫిక్ సమస్యతో బేజారు!

**వనస్థలిపురం:** వనస్థలిపురం రైతుబజారు వద్ద కూడలిలో ట్రాఫిక్ సమస్య మళ్లీ మొదటికి వస్తోంది. రైతుబజారు కూడలి వద్ద పూలు, పండ్లు ఇతర అమ్మకందారులు రోడ్డుపై వరకు తమ వ్యాపారాలను విస్తరించుకోవడంతో గతంలో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు తలెత్తేవి. ఈ క్రమంలో స్థానికులు, పరిసర కాలనీల ప్రజల ఫిర్యాదులతో జీహెచ్ఎంసీ, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసుల ఆధ్వర్యంలో రైతుబజారు వద్ద రోడ్డు ఆక్రమణలు, తోపుడు బండ్లు, షెడ్లను తొలగించారు. ట్రాఫిక్ సమస్య తొలగిందని స్థానికులు, పరిసర కాలనీల ప్రజలు ఆనందపడుతున్న సమయంలో మళ్లీ ఒకొక్కటిగా రెండు వరసల్లో తోపుడు బండ్లను ఏర్పాటు చేసుకోవడం, రైతుబజారుకు వచ్చే వారు తమ వాహనాలను రోడ్డుపై వరకు పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది.

**దళారుల పనే..**

రైతు బజారు వద్ద చిరువ్యాపారుల తోపుడు బండ్లు, వ్యాపార షెడ్లను తొలగించడంతో పలువురు ఉపాధి కోల్పోయారు. ఈ నేపథ్యంలో అధికార పార్టీ నాయకులు, సీపీఐ నాయకులు జోక్యం చేసుకుని వారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఇదే అదనుగా కొందరు దళారులు జోక్యం చేసుకుని తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకోవడానికి స్థలం కేటాయిస్తామని చెప్పి రూ. 5 వేలు చొప్పున డబ్బులు వసూలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. రైతుబజారు వద్ద రెండు, మూడు రోజులుగా వెలుస్తున్న ఆక్రమణలే ఇందుకు నిదర్శనమని పలువురు పేర్కొంటున్నారు. మళ్లీ రైతుబజారు కూడలి ఆక్రమణలకు గురవుతుండడంతో మళ్లీ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయని స్థానికులు, పరిసర కాలనీల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

**ప్రత్యేక రోజుల్లో నరకమే..**

ఇప్పటికే కూడలిలో ఓ వైపు పెట్రోల్ బంక్, సినిమా థియేటర్, వ్యాపార సముదాయాలు, మరో వైపు రైతు బజారుకు వచ్చే వాహనాల పార్కింగ్, పలు కాలనీలకు వెళ్లే ప్రధాన మార్గం ఇదే కావడంతో తరచు, పండుగలు, ఆదివారం వేళ మరింతగా ట్రాఫిక్ జాం ఏర్పడుతున్నాయని వాపోతున్నారు. ఇదేమని అడిగితే తమకు రాజకీయ రంగు పూస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ మార్గంగా వేరేచోట వ్యాపారాలు చేసుకోవడానికి అనుమతులిస్తే తమకు అభ్యంతరం లేదని, రైతుబజారు కూడలి వద్ద మాత్రం వ్యాపారాలను ప్రోత్సహించొద్దని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు.

**రోడ్డుపై పార్కింగ్ లేకుండా చూడటమే మా బాధ్యత..**

జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్, మార్కెటింగ్ శాఖ అధికారుల సూచనల మేరకు కొందరు మళ్లీ తోపుడు బండ్లు పెట్టుకుంటున్నట్లు తమకు సమాచారం ఉంది. మా వరకు మేము రోడ్డుపైకి వాహనాలు పార్కింగ్ చేయకుండా చూస్తున్నాం. తోపుడు బండ్లు, షెడ్లు ఏర్పాటుకు మాకు సంబంధం లేదని వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గట్టుమల్లు పేర్కొంటున్నారు.

## నేడు సేవాలాల్ మహారాజ్ జయంతి

**మహేశ్వరం:** మండల పరిధి ఉప్పుగడ్డతండా సేవాలాల్ మహరాజ్, జగదాంబ ఆలయంలో శనివారం సేవాలాల్ జయంతి నిర్వహిస్తున్నామని ఆలయ చైర్మన్ సీతారామ్ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటలకు ఆలయంలో జగదాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పించనున్నామని తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, కార్తీక్ రెడ్డిలు హాజరుకానున్నారని వెల్లడించారు.

## ఆక్రమణల తొలగింపు



**మలక్‌పేట:** మలక్‌పేట, సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం గడ్డిఅన్నారంలో రోడ్డు ఆక్రమణలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. దిల్‌సుఖ్‌నగర్ మెయిన్‌రోడ్డు కమలా హాస్పిటల్ నుంచి శివగంగా థియేటర్ లైన్ వరకు రోడ్డు ఆక్రమణలు తొలగించారు. రోడ్డు ఆక్రమించి చిరు వ్యాపారాలు చేస్తున్న టీ స్టాల్స్, తోపుడు బండ్లు, రోడ్డుపై పాతిన బోర్డులు తొలగించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించేలా రోడ్డును ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని మలక్‌పేట, సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు అశోక్‌కుమార్, నరసింహ నాయక్ హెచ్చరించారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



**మలక్‌పేట:** అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అధికారులను ఆదేశించారు. అక్బర్‌బాగ్ డివిజన్ ఆనంద్‌నగర్ కాలనీలో శుక్రవారం ఆయన పర్యటించిన అనంతరం ఆయా శాఖల అధికారులతో పనులపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న పనులపై దృష్టి సారించి వాటిని పూర్తి చేయాలన్నారు. డ్రైనేజీ, వాటర్ పైపులైన్ కొత్త పనులకు ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. లోప్రెషర్స్, వీధి దీపాలు సమ స్య పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్, జీహెచ్ఎంసీ ఏఈ వెంకన్న, వాటర్ వర్క్స్ ఏరియా మేనేజర్ అల్తాఫ్, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

# మార్కెట్లోకి భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్

**వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం**

**ఉప్పల్:** నాగోల్ మెట్రోస్టేషన్ సమీపంలోని ఎస్‌వీఎం గ్రాండ్ హోటల్‌లో ఇంజినీర్స్ మీట్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను మార్కెట్లోకి విడుదల చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డా.రూపేశ్ కుమార్ మాట్లాడుతూ.. మన్నిక, నాణ్యతపై అనేక ప్రయోగాలు చేశామని సిమెంట్ మన్నికపై ఇంజినీర్లకు వివరించారు. భారతి సిమెంట్ వైస్ ప్రెసిడెంట్ ఎంసీ మల్లారెడ్డి, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కొండల్ రెడ్డి మాట్లాడుతూ.. ఇతర సిమెంట్‌తో పోల్చితే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా పూర్తవుతుందన్నారు. ముఖ్యంగా స్లాబ్‌లు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక పేర్కొన్నారు. తమ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని, స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయ పడతారని సూచించారు. కార్యక్రమానికి మహానగరంలోని ఇంజినీర్లు, భారతి సిమెంట్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**చంపాపేట:** విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. చంపాపేట 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సాయిరాం నగర్, ఆర్‌టీసీ, శిఖరఎన్‌క్లేవ్, నాగార్జున, భాను నగర్, కేశవనగర్, సింగరేణి, రాఘవేంద్ర ప్రెస్ కాలనీ కాలనీల్లో విద్యుత్ ఉండదన్నారు.

## కూరగాయల ధరలు

**దిల్‌సుఖ్‌నగర్:** సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.11, వంకాయ రూ.18, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.28, కాకరకాయ రూ.32, బీరకాయ రూ.28, కాలిఫ్లవర్ రూ.15, క్యాబేజీ రూ.08, క్యారెట్ రూ.15, దొండ రూ.28, ఆలుగడ్డ రూ.21, ఉల్లిగడ్డ రూ.39, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.23, సొరకాయ రూ09, పొట్లకాయ రూ.15, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.28, చామగడ్డ రూ.43, మునగ రూ.65, చిలుకడ దుంప రూ.65, బీట్‌రూట్ రూ.15, కీర రూ.18, బీన్స్ రూ.35, క్యాప్సికమ్ రూ.35. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

## ప్రత్యేక పూజలు



**చంపాపేట:** ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కమలాసుధీర్‌రెడ్డి వివాహ దినోత్సవం సందర్భంగా శుక్రవారం చంపాపేట డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ముదుపు రాజిరెడ్డి ఆధ్వర్యంలో కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామివారిని దర్శించుకుని సుధీర్‌రెడ్డి దంపతుల పేరిట ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో యాదగిరి, ఉమామహేశ్వర్, రవిముదిరాజ్, గోగిరెడ్డి అంజిరెడ్డి, ప్రభాకర్, యాదయ్య, శివగౌడ్, జగదీష్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, వసంతరెడ్డి, సత్యనారాయణ, కేశవరెడ్డి, రాజు, మహేష్ పాల్గొన్నారు.

## చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

**హయత్‌నగర్:** అప్పుల బాధ భరించలేక పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. హయత్‌నగర్ కట్టమైసమ్మ కాలనీలో నివాసముండే సిరికొండ శివాజీ డ్రైవర్‌గా పని చేస్తుండగా ఆయన భార్య లత ఇళ్లలో పని చేస్తుంది. వారికి ఇద్దరు పిల్లలు. అప్పులు ఎక్కువవ్వడంతో మనస్తాపానికి గురైన శివాజీ గురువారం పురుగుల మందు తాగాడు. గమనించిన భార్య చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.



# ఇరుకు రోడ్డుకు మోక్షం

- తీరనున్న రవాణా కష్టాలు
- వేగంగా కొనసాగుతున్న విస్తరణ పనులు
- పెద్ద గోల్కొండ ఔటర్ వరకు బీటీ నిర్మాణం
- రూ.5.65 కోట్లతో 2.1 కి.మీ రోడ్డుమార్గం



నాగారం- పెద్ద గోల్కొండ ఔటర్ వరకు కొనసాగుతున్న బీటీ నిర్మాణ పనులు

**మహేశ్వరం:** ఎట్టకేలకు ఇరుకైన గుంతల రోడ్డుకు మోక్షం లభించింది. చాలా కాలంగా నిర్మాణ పనులు నీరసించినప్పటికీ.. ప్రజల డిమాండ్, ప్రజాప్రతినిధుల చొరవతో బీటీ పనులు పరుగులు తీస్తుండటంతో.. వాహనదారుల కష్టాలు తీరనున్నాయి. కొత్తగా రహదారి, ఆపై విస్తరణ పనులు శరవేగంగా కొనసాగుతుండటంతో మండల ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. మండల పరిధి నాగారం- పెద్ద గోల్కొండ ఔటర్ వరకు ఆర్అండ్‌బీ శాఖ నుంచి 2.1 కిలో మీటర్ల దూరానికి 33 ఫీట్ల వెడల్పు రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.5.65 కోట్ల నిధులను మంజూరు చేసింది. గతంలో ఈ మార్గం 20 ఫీట్ల వెడల్పు ఉండేది. ప్రస్తుతం 33 ఫీట్ల విస్తరణ, రోడ్డుకు ఇరు వైపులా 5 ఫీట్ల సైడ్ బర్మ్ నిర్మిస్తున్నారు. పనులను ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులు, డీఈ, ఏఈలు నిత్యం పర్యవేక్షిస్తున్నారు.

**సరిపడా నిధులు లేక!**

రహదారి వినియోగంలోకి వస్తే మహేశ్వరం మండలంతో పాటు కేశంపేట్, కందుకూరు మండలాల ప్రజలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు, ఔటర్ రింగ్ రోడ్డుపై నుంచి వెళ్లడానికి సౌకర్యవంతంగా ఉంటుంది. మండల కేంద్రం నుంచి మన్సాన్‌పల్లి కూడలి, నాగారం వరకు రోడ్డు నిర్మాణం వెడల్పుగా ఉంది. నాగారం నుంచి పెద్ద గోల్కొండ ఔటర్ రింగ్ రోడ్డు వరకు రోడ్డు ఇరుకుగా ఉండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఈ మార్గం గుండా మహేశ్వరం డిపో నుంచి శంషాబాద్, అఫ్జల్‌గంజ్‌కి ఆర్టీసీ బస్సులు తిరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో రహదారి విస్తరణకు గత ప్రభుత్వ హయాంలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి. కాని బిల్లులు సరిగా రాకపోవడంతో పనులు నీరసించాయి. ఇదే విషయమై బీఆర్ఎస్ నాయకులు కొందరు.. ఎమ్మెల్యే సబితారెడ్డి దృష్టికి తేగా.. ఆమె ఆర్అండ్‌బీ అధికారులు, నిర్మాణదారుడితో ఫోన్లో మాట్లాడారు. ప్రజా రవాణాను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ పనులు పూర్తి చేసి, రోడ్డును వినియోగంలోకి తేవాలని ఆదేశించారు.

**పూర్తయితే బాగుంటుంది**



ఇరుకు ఆపై గుంతల రోడ్డుపై ప్రయాణించాలంటే ఇబ్బందిగా ఉండేది. నిత్యం అనేక రోడ్డు ప్రమాదాలు జరిగేవి. ప్రస్తుత విస్తరణ పనులు పూర్తయితే.. రవాణా మార్గం సౌకర్యవతంగా ఉంటుంది. పనుల గురించి ఎమ్మెల్యే సబితారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి.

– మంచె పాండు యాదవ్, పీఏసీఎస్ చైర్మన్, మహేశ్వరం

**త్వరగా పూర్తి చేస్తాం**

నాగారం– పెద్ద గోల్కొండ ఔటర్ వరకు 2.1 కిలో మీటర్ల దూరం బీటీని నిర్మిస్తున్నాం. బిల్లులు ఆలస్యం కావడంతో పనులు నెమ్మదించాయి. రోడ్డుకు ఇరువైపులా మట్టి, కంకర, డస్ట్ పోసి సమాంతరం చేస్తున్నాం. నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నాం. వీలైనంత త్వరగా పూర్తి చేస్తాం.

– రవీందర్ గౌడ్, ఆర్అండ్‌బీ డీఈ, మహేశ్వరం

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**హుడాకాంప్లెక్స్:** మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కె.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ లక్ష్మీనగర్ ఫీడర్ పరిధి కాలనీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, 11కేవీ ఇందూ అరణ్య అపార్ట్‌మెంట్స్, టీ.ఎస్. హౌసింగ్‌బోర్డు ఫీడర్ల కింది కాలనీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, 11కేవీ జైపురికాలనీ, రాజీవ్ స్వగృహ- ఏ,బీ,సీ,డీ బ్లాకులు, విశాలాంధ్ర ఫీడర్ల పరిధిలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు, 11కేవీ పెద్దఅంబర్ పేట ఫీడర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు సరఫరాను నిలిపివేయనున్నామని వెల్లడించారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహ కరించాలని ఆయన కోరారు.

## కేంద్రం నిధులతోనే అభివృద్ధి

**బడంగ్‌పేట్:** కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు, నిధులతో మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లో చేస్తున్న అభివృద్ధి పనుల వివరాలను అందచేయాలని దిశ కమిటీ జిల్లా సభ్యుడు శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు శుక్రవారం అసిస్టెంట్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2018 నుంచి 2025 వరకు అమృత్ మిషన్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, స్వచ్ఛభారత్, స్మార్ట్ సిటీ మిషన్‌లతో పాటు ఇతర పథకాల ద్వారా వచ్చిన నిధులతో కార్పొరేషన్‌లో చేసిన అభివృద్ధి, ఇతర పనుల వివరాలను ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేషన్‌- 1 అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ఉన్నారు.